క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్యారమ్ ఆడుతున్న చిన్నారులు

పెదగంట్యాడ: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మంగళవారం చిన్నారులతో ఆటలు ఆడించారు. అలాగే పుస్తకాలు చదివించారు. కథలు చెప్పారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

యజ్ఞంలా మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీ


మంచినీటి బాటిళ్లను రైల్వే ప్రయాణికులకు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అగనంపూడి: ఎండల నేపథ్యంలో సాధారణ బోగీల ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి పలు సంస్థలు చేపట్టిన మినరల్ వాటర్‌బాటిళ్ల పంపిణీ రెండువారాలుగా యజ్ఞంలా కొనసాగుతోంది. మానవతా స్వచ్ఛంద సంస్థ, లయన్స్‌క్లబ్, మానవ వికాస వేదిక, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, సత్యసాయి సేవా సమితి, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, స్పందన చేయూత ఫౌండేషన్, వంటి సంస్థల సహకారంతో మంగళవారం భువనేశ్వర్ బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్, మహిళా, దివ్యాంగుల బోగీల్లోని ప్రయాణికులకు లీటర్ మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. 250 మందికి వీటిని అందించామని సంస్థల ప్రతినిధులు ఎంఎస్.ఎన్.మూర్తి, కంచుమూర్తి ఈశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో జాషువ, ఆదిల్ రెహమ్సన్, శ్రీనివాస్. మంగ, శ్రావణి, కౌశిక్, బుచ్చిరాజు, నాగేశ్వరరావు, భాస్కరరాజు పాల్గొన్నారు.

రమణారావు మృతికి సంతాపం


పీవైవీ రమణారావు(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ఎలక్ట్రికల్ విభాగంలో ఉద్యోగం చేస్తూ ఉద్యోగ విరమణ తర్వాత సీటూ, సీపీఎం పోరాటాల్లో పాల్గొంటూ కార్మిక సమస్యలపై ఎనలేని కృషి చేసిన పీవైవీ రమణారావు మృతి భెల్ సీటూ, సీపీఎం పార్టీలకు తీరని లోటు అని సీటూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. మంగళవారం ఉదయం పేపర్లు పంచుతూ రోడ్డు ప్రమాదంలో పీవైవీ రమణారావు అకాల మరణం చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న నాయకులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిగా నిలిచాయని సంస్థ సీటూ నాయకులు ఎస్.జగన్నాథరావు, కె.నారపురెడ్డి, ఎస్.అప్పారావు, కె.విజయ్‌కుమార్, ఆర్.జనార్దనరావు, పి.కనకారావు కొనియాడారు.

బంగారు పతకాలకు నగదు అందజేత


చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థి

విశాఖ విద్య: ఏయూ అప్లయిడ్ మ్యాథమేటిక్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రాఘవేంద్ర రావు పేరున బంగారు పతకాన్ని అందజేయాలని కోరుతూ ఆస్ట్రేలియాకు చెందిన ఏయూ పూర్వ విద్యార్థి రాఘవేంద్రరావు కుంబారి రూ.3 లక్షల చెక్కును వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు మంగళవారం అందజేశారు. అదేవిధంగా ప్యూర్ మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి ఆచార్య నాగరాజారావు పేరున బంగారు పతకాన్ని అందించాలని కోరుతూ మరో రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ బంగారు పతకాలు అందించడానికి అవసరమైన నిధులను విశ్వవిద్యాలయానికి అందజేసిన దాతలను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, డీన్ ఆచార్య కె.ఈశ్వరకుమార్, అట్టారి నిర్మల పాల్గొన్నారు.

పరేషన్!


ఎన్నిసార్లు తిరగాలని సిబ్బందిని నిలదీస్తున్న రేషన్‌కార్డు దరఖాస్తుదారులు

కూటమి పాలనలో 'కొత్త' తలనొప్పి!

కూటమి ప్రభుత్వం సచివాలయాల నిర్వహణను గాలికి వదిలేసింది. కార్యాలయ నిర్వహణ, కంప్యూటర్ల సర్వీసింగ్‌తో అవసరమైన మరమ్మతులకు నిధులు విదల్చలేదు. చాలా కంప్యూటర్లు, ప్రింటర్లు మూలకు చేరాయి. దీంతో ప్రజలు ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది.

కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. దీంతో ఎంతో ఆశగా సచివాలయానికి వెళ్తున్న దరఖాస్తుదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు, మార్పులు, చేర్పులు చేసుకోవడానికి పనులు మానుకొని సచివాలయానికి పరుగులు తీస్తున్నా ప్రయోజనం లేకపోతోందని దరఖాస్తుదారులు నిట్టూరుస్తున్నారు. అక్కడ సక్రమంగా కంప్యూటర్లు పని చేయకపోవడంతో సిబ్బంది రేపుమాపు అంటూ తిప్పుతున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

- రేషన్‌కార్డు దరఖాస్తులకోసం సచివాలయాలకు ప్రజలు
- పనిచేయని కంప్యూటర్లు.. వేధిస్తున్న సర్వర్ సమస్య
- మళ్లీ రావాలని తిప్పుతున్న వైనం
- చందాలు వేసుకుని స్టేషనరీ కొంటున్న ఉద్యోగులు


పనిచేయని కంప్యూటర్లు, ప్రింటర్లు

పెదగంట్యాడ: ఈ నెల 7 నుంచి కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల్లో పిల్లల యాడింగ్, మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్టు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. కొత్త రేషన్ కార్డు కోసం కుటుంబ సభ్యుల ఫొటో, ఆధార్ కార్డులు ఉండాలని సూచించారు. కొత్తగా పెళ్లయిన వారు విధిగా మ్యారేజ్ సర్టిఫికెట్ పెట్టాలని షరతు విధించారు. ఆపై పిల్లల యాడింగ్ కోసం ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. దీంతో రేషన్ కార్డులు లేనివారంతా గంపెడాశతో ప్రభుత్వం సూచించిన మేరకు సదరు సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులతో సచివాలయాలకు వెళ్తున్నారు. అయితే అక్కడ సక్రమంగా సర్వర్ పని చేయకపోవడంతో పాటు కంప్యూటర్లు మొరాయించడంతో ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. సచివాలయాల్లోని కంప్యూటర్లు పని చేయకపోవడంతో అక్కడ సిబ్బంది చందాలు వేసుకొని వాటిని బాగు చేయించుకుంటున్నా సర్వర్ సమస్య వారిని మరింతగా విసిగిస్తోంది. అలాగే స్టేషనరీని కూడా సరఫరా చేయకపోవడంతో దానికి డబ్బులు పోగు చేసుకొని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. సచివాయాల్లోని పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తే.. తామేం చేయలేమంటూ ఉన్నతాధికారులు చేతులెత్తేయడం గమనార్హం.

కాళ్లరిగేలా తిరుగుతున్నా..

రేషన్ కార్డుల కోసం జనం సంబంధిత పత్రాలు పట్టుకొని సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నెల 7 నుంచి ఇప్పటి వరకూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన విడుదల చేసినా.. అందుకు సచివాలయాలను సన్నద్ధం చేయకపోవడంతో దరఖాస్తుదారులు తిప్పలు పడుతున్నారు. అసలు తమకు రేషన్‌కార్డు వస్తుందో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాలకు అవసరమైన సామగ్రిని అందజేయడంతో పాటు దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

కంప్యూటర్లు పనిచేయలేదంట



నాకు రేషన్ కార్డు ఉంది. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిని రేషన్‌కార్డులో యాడింగ్ చేయించేందుకు పని మానుకుని వారం రోజుల నుంచి సచివాలయానికి వస్తున్నాను. అక్కడ కంప్యూటర్లు పని చేయడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఇలా అయితే ఎలా.. ప్రభుత్వం ప్రకటనలు ఇస్తే సరిపోదు కదా.. అందుకు అనువైన ఏర్పాట్లు చేయాలి కదా.. ఇలా ప్రజలను ఇబ్బందులు పెట్టడం సరి కాదు.. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– నడుపూరు శైలజ, శీరవానిపాలెం, పెదగంట్యాడ

దరఖాస్తు స్వీకరించలేదు



నాకు రేషన్ కార్డు లేదు.. కొత్త కార్డు కోసం అవసరమైన పత్రాలు పట్టుకొని రోజూ సచివాలయానికి వెళ్తున్నాను. వారం రోజులుగా కాళ్లరిగేలా తిరుగుతున్నాను. ఇంతవరకు నా దరఖాస్తు స్వీకరించలేదు.. ఈ నెల 7 నుంచి రోజూ వస్తున్నా.. ఫలితం లేదు. ఈ విషయంలో అధికారులు చొరవ చూపాలి.. దరఖాస్తులు స్వీకరించేలా చూడాలి.. నాకు కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలి.

– యండా లత, నడుపూరు, పెదగంట్యాడ

వైభవంగా కుంచమాంబ పండగ


కుంచమాంబకు పూజలు చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదకోరాడలో గ్రామ దేవత కుంచమాంబ పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీరలు, సారె సమర్పించారు. సాయంత్రం జాతర నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పెదకోరాడకు చెందిన మహిళలు కోలాటంతో ఆకట్టుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి వెంకటరమణారెడ్డి బసారెడ్డి, ఎస్. వెంకటరావు, ఎస్. అప్పారావు, గొందేశి ప్రభాకర్, పులి తమ్మునాయుడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాల శ్రీనివాసరెడ్డి, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాల్సిందే


85వ వార్డు అగనంపూడిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు

అగనంపూడి: జీవీఎంసీలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎంటీఎస్, ఆప్కాస్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 20న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని 79, 85, 88 వార్డుల్లో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సమ్మె పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు విధులకు హాజరుకాకుండా రైల్వే న్యూకాలనీ వద్దకు చేరుకొని ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 12వ పీర్సీ కమిటీ వేయాలని, మరణించిన, అనారోగ్యంతో బాధపడుతూ విధులకు హాజరుకాలేని కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సత్యవతి, నాగమణి, రాజు, అరుణ, మీనాక్షి, రాము, భాను, నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

18న 'ఓంశాంతి' ఉచిత వైద్య శిబిరం

అగనంపూడి: ప్రజాపిత బ్రహ్మకుమారి అగనంపూడి సంస్థ (దివ్యజ్యోతి భవనం), ఎస్‌డీఎం చారిటబుల్ ట్రస్ట్ (లంకెలపాలెం) ఆధ్వర్యంలో ఏప్లస్ ఆస్పత్రి సహకారంతో ఈనెల 18న అగనంపూడి దివ్యజ్యోతి భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి బీకే రామకోటి తెలిపారు. ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, మధుమేహ వ్యాధి నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. వైద్యసేవలతోపాటు ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించనున్నట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎండకు ఎండి.. వానకు తడిచి


రథం నిలిపేందుకు పునాది వేసి వదిలేసిన అధికారులు


ఎండలో జగన్నాథస్వామి రథం

అగనంపూడి: అగనంపూడి జగన్నాథస్వామి ఆలయానికి చెందిన రథానికి ఆదరణ కరువైంది. రథం ఎండకు ఎండి, వానకు తడుస్తోంది. ఏటా జూలైలో నిర్వహించే జగన్నాథస్వామి రథోత్సవాల సందర్భంగా పదిరోజుల పాటు రథాన్ని ఇంద్రద్యుమ్నహాలు వద్ద ఉంచుతారు. తిరుగు రథోత్సవం తర్వాత రథాన్ని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న జగన్నాథస్వామి రథానికి కేటాయించిన చోట ఉంచుతారు. అయితే రథం గతంలో కమ్మల పాకలో ఉండేది. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మూడు మాసాల కిందట ఆలయ కమిటీ, దేవదాయ శాఖ అధికారులు పర్యవేక్షణలో రథానికి షెల్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే భూ మట్టానికి వచ్చిన తర్వాత రెండు మాసాల నుంచి పనులు వదిలేయడంతో రథం ఎండకు ఎండి వానకు తడుస్తోంది. పాలకులు, అధికారులు కలుగజేసుకొని షెల్టర్ నిర్మాణ పనులు వర్షాకాలం రాకమునుపే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు


రహదారి విస్తరణ పనులు మధ్యలో వదిలేయడంతో చేరిన వరదనీరు

అగనంపూడి: అమృత భారత్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులు పడుతున్నారు. రెండేళ్ల కిందట దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు రహదారి విస్తరణ చేపట్టారు. నాగదేవత కొండను ఆనుకొని డ్రైనేజీ కమ్ ప్రొటెక్షన్ వాల్ నిర్మించి, రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి క్రషర్ బుగ్గి, కంకర వేసి వదిలేశారు. సుమారు అర్నెల్ల నుంచి పనులు నిలిచిపోవడంతో కంకర, క్రషర్‌బుగ్గి చెల్లా చెదురుగా పోయి రహదారి గోతుల మయంగా మారింది. దీంతో సోమవారం రాత్రి పడిన వర్షానికి వరద నీరు గోతుల్లో నిలిచిపోయింది. పెద్ద పెద్ద గోతుల కారణంగా నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు.రైల్వే ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ


సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరసింగరావు, భవన నిర్మాణ కార్మికులు

దాబాగార్డెన్స్: ఈ నెల 20న పిలుపునిచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తామూ భాగస్వాములమేనని భవన నిర్మాణ కార్మికులు తెలిపారు. సమ్మెను పురస్కరించుకుని సిటు నాయకుడు మంగళవారం నగరంలోని సింగ్ హోటల్ జంక్షన్ వద్ద సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మికులను రక్షించుకుందామనే నినాదంతో భవన నిర్మాణ కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మికులు పార్వతమ్మ, శ్రీను నాయుడు, సింహాచలం, పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. కుంచమాంబ



తీర్థమహోత్సవంలో జనసందోహం, పూజలందుకున్న కుంచమాంబ అమ్మవారు

- ఘనంగా అమ్మవారి తీర్థమహోత్సవం
- పోటెత్తిన భక్తజనం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పురప్రజల ఆరాధ్య దైవం కుంచమాంబ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం వేకువ జామునే అమ్మవారిని గాజువాక ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గాజువాక ప్రధాన రహదారులన్నీ విద్యుత్ దీపాల కాంతులతో వెదజల్లాయి. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, పలు పార్టీల ముఖ్య నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. తప్పెట గుళ్లు, సాము గరిడి, స్టేజి ప్రోగ్రామ్‌లు నిర్వహించారు. భక్తులతో రోడ్లన్నీ కిక్కిరిపోయయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

ముగిసిన ధ్యాన యజ్ఞ మహోత్సవం


మాట్లాడుతున్న రత్నకుమారి

పెదగంట్యాడ: భగవాన్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ సంకల్పం మేరకు లోకకల్యాణం కోసం నిర్వహించిన ఇంటింటా ధ్యాన యజ్ఞ మహోత్సవం విజయవంతంగా ముగిసిందని పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యుయవల్ ట్రస్ట్ వైస్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ఆర్ రత్నకుమారి అన్నారు. బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 రోజులుగా నిర్వహించిన ఇంటింటా ధ్యాన యజ్ఞ మహోత్సవం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా పెదగంట్యాడ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో నిర్వహించిన ముగింపు ఉత్సవంలో ఆమె ప్రసంగించారు. ధ్యాన జగన్ నిర్మాణం కోసం.. ప్రతి ఒక్కరిని ధ్యానులుగా, శాకాహారులుగా మార్చేందుకు ట్రస్ట్ ఆధ్వర్యంలో విశేష కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే ప్రపంచ శాంతి కోసం, అందరిలో పాజిటివ్ ఎనర్జీ నింపేందుకు ఈ యజ్ఞం ఉపయోగపడుతుందని చెప్పారు. బుద్ధుని బోధనలు అనుసరణీయమన్నారు. ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మీసాల శివగణేశ్వరరావు, రేవతీదేవి, వర్మరాజు, ఇందిరా లక్ష్మి, భాగ్య గౌరి, అప్పారావు, బాలాజీ, భానుమతి, వనిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు కీలకం

గ్రామ/వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులతో సీఐ సతీష్‌కుమార్


మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో అత్యంత కీలకంగా విధులు నిర్వహిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ సూచించారు. క్షేత్రస్థాయిలో అసాంఘిక కార్యకలాపాలు, ఇతర నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చినముషిడివాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గ్రామ/వార్డు సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, బెల్ట్ దుకాణాల్లో మద్యం అమ్మకాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలన్నారు. సచివాలయాల పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర నేర నియంత్రణ ప్రక్రియపై ప్రజలకు తగిన అవగాహన కలిగించాలన్నారు. సున్నితమైన మైనర్లపై అత్యాచారాలు, బాల్యవివాహాలు, గృహహింస, చిల్లర నేరాలపై కూడా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, సమాచారం ఉన్నతాధికారులకు చేరవేయాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో బాధితులకు, రిఫరల్ సేవలకు తగిన సహకారం అందించేందుకు మహిళా సంరక్షణ కార్యదర్శులు ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పలువురు అధికారులు, పోలీస్ సిబ్బంది, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ/వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

మహారాణిపేట: గ్రామ, వార్డు సచివాలయ సెక్రటరీల పదోన్నతుల సమస్య పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ (ఏపీ ఎస్‌డబ్ల్యుఏఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.జె. గణేష్‌కుమార్ కోరారు. మంగళవారం అమరావతిలో జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ ఆనందరావు ఆధ్వర్యంలో రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్‌ను కలిసి వార్డు సెక్రటరీల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గడిచిన అయిదు సంవత్సరాల వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సేవను జూనియర్ అసిస్టెంట్‌గా పరిగణించి, అప్‌గ్రేడ్ చేయాలని, వారి తదుపరి ప్రమోషన్‌ను నోడల్ లేదా జోనల్ స్థాయిలో కొత్త పోస్టు సృష్టించి, సీనియర్ అసిస్టెంట్ పేస్కేలు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, జనరల్ సెక్రటరీ శేషుబాబు, వైస్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, స్టేట్ ట్రెజరర్ చింతకాయల బంగారు రాజు,,స్టేట్ ఉమెన్ ప్రెసిడెంట్ కిరణ్మయి, జాయింట్ సెక్రటరీ పాండురంగ బెల్లంకొండ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ఉత్కంఠగా మాక్ డ్రిల్


మాక్‌డ్రిల్‌లో ఆక్టోపస్ బృందం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో రాష్ట్ర పోలీస్ కమాండో విభాగం ఆక్టోపస్ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ థండర్'మాక్ డ్రిల్‌ను మంగళవారం ఉత్కంఠగా నిర్వహించారు. అత్యవసర పరిస్థితిలో పోలీస్ యంత్రాంగం స్పందించాల్సిన తీరుపై ఈ మాక్‌డ్రిల్ కొనసాగింది. మాక్ డ్రిల్‌లో భాగంగా ఆరుగురు ఉగ్రవాదులు ఆయుధాలతో ఎన్టీపీసీలో చొరబడి, బహిరంగ కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న ఆక్టోపస్ బృందం వెంటనే స్పందించి వ్యూహాత్మక ఆపరేషన్ ప్రారంభించింది. ఉగ్రవాదులను న్యూట్రలైజ్ చేసి వారి చేతిలో బందీలుగా ఉన్న వారిని రక్షించింది. మాక్ డ్రిల్ నిర్వహణ కోసం ముందుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్‌కుమార్, ఆక్టోపస్ అదనపు పోలీస్ అధికారి రాజారెడ్డి, పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ ఆర్.మల్లికార్జునరావు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, వైద్య సిబ్బంది, రెవెన్యూ, సేఫ్టీ అధికారులు, అనకాపల్లి ఏఆర్ విభాగానికి చెందిన బీడీ టీం, డాగ్ స్క్వాడ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.